క్లుప్తంగా

కరుణించమ్మా కనకదుర్గమ్మా


అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు


దుర్గాదేవి

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో కనకదుర్గ అమ్మవారి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మహిళలు ముర్రాట్లు సమర్పించారు. ఆలయ ధర్మకర్త డోల రామారావు దంపతులు, గ్రామస్తులతో కలిసి భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన కుంకుమ పూజలో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు చేపట్టారు.

జూలై 27 నుంచి శ్రావణమాస ఉత్సవాలు


కరపత్రం ఆవిష్కరిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో సంతోషమాత అమ్మవారి ఆలయంలో జూలై 27 నుంచి ఆగస్టు 23 వరకు శ్రావణ మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ మునగవలస సుకన్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆలయ ఆవరణలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అర్చకులు కిరణ్‌శర్మ మాట్లాడుతూ ఈ ఏడాది 5 శ్రావణ శుక్రవారాలు ఉంటాయని, ఆగస్టు 2న వరలక్ష్మి వ్రతం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

విజయ గణపతికి విశేష పూజలు


విజయ గణపతికి హారతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్య నగేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

తప్పిన పెను ప్రమాదం


గోశాలపై పడిన చెట్టు

జి.సిగడాం: మండలంలో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలుల ధాటికి గొబ్బూరు–జి.సిగడాం గ్రామాల మధ్య చెట్లు నేలకూలాయి. భవనాలు, రోడ్లు, ఆవుల షెడ్లపై పడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

రక్తదానంతో పునర్జన్మ


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల: ఒకరి రక్తదానంతో మరొకరికి పునర్జన్మ లభిస్తుందని శ్రీవేంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కాలేజీ ఫార్మశీ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగోజీ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఎచ్చెర్లలోని వేంకటేశ్వర కాలేజీ ఆవరణలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి బి.తిరుపతిరావు, ప్రిన్సిపాల్ పి.చిట్టిబాబు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, ఎస్.ఉమాశంకర్ పాల్గొన్నారు.

యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న దృశ్యం

గార: యోగాసనాలతో చక్కటి ఆరోగ్యం పొందవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కె.మత్స్యలేశం బీచ్‌లో యోగాంధ్రలో భాగంగా బుద్ధా పాఠశాలలో యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఓ కె.భారతిసౌజన్య, డ్వామా పీడీ సుధాకర్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, తహశీల్దార్ ఎం.చక్రవర్తి, ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు, సర్పంచ్ బి.లలిత, ఎంపీటీసీ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిక్కోలు వాకిట.. సిరిమాను సంబరం

- పాత శ్రీకాకుళంలో అంబరాన్నంటిన గ్రామదేవత పండగలు
- జంట సిరిమానులతో కనుల పండువగా ఉత్సవం
- పోటెత్తిన భక్తజనం


మహిషాసుర మర్దిని
భవనాల పైకి ఎక్కి సిరిమానోత్సవం వీక్షిస్తున్న జనం
ఆకట్టుకున్న కాళికా నృత్యం
అశేష జనసందోహం నడుమ జంట సిరిమానోత్సవం
సిరిమానులను అధిరోహించిన పూజారులు

శ్రీకాకుళం కల్చరల్: దశాబ్దం తర్వాత జరుగుతున్న గ్రామదేవత పండగలతో పాత శ్రీకాకుళంలో సందడి వాతావరణం నెలకొంది. మంగళవారం నిర్వహించిన జంట సిరిమాను ఉత్సవాలతో నగరం పులకించిపోయింది. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార వ్యవహారిక కార్యక్రమం అనుపు ఉత్సవం అంబరాన్ని అంటింది. ఓవైపు వర్షం పడుతున్నా లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆ ప్రాంతం జనసంద్రాన్ని తలపించింది. ప్రతి ఇంటి నుంచి ఘటాలను అమ్మవారి వద్దకు తీసుకెళ్లి దీపాలు వెలిగించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దమ్మతల్లి సిరిమానుపై పాత శ్రీకాకుళంకు చెందిన మావూరు కుమారస్వామి పూజారి కూర్చోగా.. నూకాలమ్మతల్లి అమ్మవారి సిరిమాను నక్కవీధికి చెందిన పాలుమూరు అచ్యుతరావు పూజారి ఆసీనులయ్యారు. వీరినే అమ్మవార్ల ప్రతినిధులుగా భావించిన భక్తులు అరటిపండ్లు, నాణేలు విసిరి భక్తిభావాన్ని చాటుకున్నారు.

వైభవంగా ఊరేగింపు..

సిరిమానుల వెంట ఊరేగింపులో దేశెల్లవీధి నుంచి పడవ, బాదుర్లపేట నుంచి రథం, దండి వీధి ఏనుగు, కలెక్టర్ బంగ్లా వీధి నుంచి మహిషాసుర మర్దని తరలివచ్చాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, తప్పెటగుళ్లు, చెక్క భజన, బిందెల డ్యాన్సు, సిరిసిర నృత్యం, బండ్ల వేషాలు, పులి వేషాలు, అమ్మవార్ల వేషాలు ఆకట్టుకున్నాయి.

అర్ధరాత్రి వరకు..

సాయంత్రం ప్రారంభమైన సిరిమాను ఊరేగింపు ముందుగా మావూరి వీధిలో చిట్టియ్య ఇంటి నుంచి వెయ్యి కళ్ల ఘటంతో ప్రారంభమయ్యాయి. సంతోషిమాత గుడి వద్దకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌లు కొబ్బరికాయ కొట్టి సంబరాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి, మావూరు వీధి, కలెక్టర్ బంగ్లా, హరిజన వీధి, బాదుర్లపేట, కొత్తపేట, కునుకుపేట వరకు వెళ్లి తిరిగి వెనుకకు వచ్చి కుందనపుపేట మీదుగా జిల్లా పరిషత్ కూడలికి చేరి అక్కడి నుంచి దేశెల్లవీధి, నక్కవీధి, దండివీధి వరకు ఊరేగింపు కొనసాగింది. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు దండి పంకజాక్ష దేవ్, డాక్టర్ శివప్రసాద్, ఎల్.రామలింగస్వామి, మావూరు శేఖర్, నక్క శంకరరావు, కల్లెపల్లి సోంబాబు, దండి రాజేంద్ర దేవ్, దండి శ్రీనివాస్, కర్రి రంగాజీ దేవ్, దేశెల్ల గోవింద మల్లిబాబు, గుత్తు చిన్నారావు, ముప్పన శ్రీనివాసరావు, గుంటముక్కల పాపారావు, మింద్రాన రమేష్, అదపాక రాంబాబు, కోల వేణుగోపాలదేవ్, దాసరి తిరుమలరావు, సన్యాసి, సాధు గణేష్, గింజి తాతారావు, సాధు గణేష్, అశ్వినీకుమార్, నక్క రవికుమార్, కునుకు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు


దండివీధి నుంచి ప్రారంభమైన ఏనుగు


సిరిమాను పూజారిని తాకేందుకు ఎగబడుతున్న భక్తులు


బాదుర్లపేట నుంచి ప్రారంభమైన రథం


దేశెల్లవీధి నుంచి ప్రారంభమైన పడవ


అలరించిన కోలాటం

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- సాక్షి కార్యాలయంపై దాడి హేయమైన చర్య
- మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం కొనసాగుతోందని, దీనికి నిదర్శనం సాక్షి మీడియాపై జరుగుతున్న దాడులేనని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ప్రజలకు అనేక హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల చెవిలో పువ్వులు పెట్టారని దుయ్యబట్టారు. ఇటువంటి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా పేదల కోసం ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమని ధ్వజమెత్తారు. పింఛన్లు, పథకాల కోసం లక్షలాది మంది అర్హులు ఎదురుచూస్తున్నారని, వీటిని ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎచ్చెర్లలో సాక్షి కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. మీడియా సంస్థలపై దాడులు శ్రీకాకుళంలో ఎప్పుడూ లేవన్నారు. ఈ నెల 4న నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీకి అధిక సంఖ్యలో జనాలు స్వచ్ఛందంగా తరలివచ్చారని, వీటిని చూసి కూటమి నాయకులు ఓర్వలేక సాక్షి కార్యాలయాలపై దాడులు చేశారని మండిపడ్డారు.

హామీలు అమలు చేయలేకే దాడులు


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి శ్రీరామమూర్తి

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజాక్షేత్రంలో వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను సాక్షి మీడియా ప్రజలకు చూపుతోందని, దీనిని తట్టుకోలేకే ఆ సంస్థ కార్యాలయాలపై టీడీపీ నేతలు దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. మంగళవారం దవళపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్‌తోపాటు 143 హామీలను ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా అమలు చేయకపోవడంతో ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందన్నారు. వీటిని ఎప్పటికప్పుడు బయటపెడుతున్న సాక్షి మీడియాపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజలే తగ్గిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. సమావేశంలో సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, కార్యకర్తలు కంచరాన రమణారావు, పేడాడ కృష్ణంరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం


మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్/జి.సిగడాం: బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమని శ్రీకాకుళం ఐసీడీఎస్ అర్బన్ కృష్ణాపార్కు సెక్టారు సూపర్‌వైజర్ పి.సీతామహాలక్ష్మి అన్నారు. గాజులవీధి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాల్య వివాహాల నిషేధంపై కిశోర బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డ్ ఇన్‌చార్జి రాజేష్ రెడ్డి, ఎంఎస్‌కే రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, లత, సరిత, కళావతి తదితరులు పాల్గొన్నారు. జి.సిగడాం మండలం వాండ్రంగి గ్రామంలోనూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రామకృష్ణారావు, సూపర్‌వైజర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ



శ్రీకాకుళం క్రైమ్ : పాత శ్రీకాకుళంలో కొలువుదీరిన పెద్దమ్మతల్లి, నూకాలమ్మ తల్లి సిరిమానోత్సవం సందర్భంగా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ సీహెచ్ వివేకానంద మంగళవారం తెలిపారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాలు, సూచనలతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్ నియంత్రణ, డ్రోన్, సీసీ కెమెరాల నిఘాతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతిభద్రతలకు విఘాతం లేకుండా సిరిమాను జరిగిందన్నారు.

16లోగా అడ్మిషన్లు పొందాలి

రణస్థలం: ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 16లోపు అడ్మిషన్ పొందాలని, లేనిపక్షంలో సీటు రద్దవుతుందని ప్రిన్సిపాల్ పాట్నూరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. గడువులోగా అడ్మిషన్ పొందకపోతే, వరుసలో తదుపరి ఉన్న విద్యార్థికి సీటు కేటాయిస్తామని పేర్కొన్నారు.

ఔత్సాహిక వ్యాపారులకు అవగాహన


మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని పలు ఆర్టీసీ బస్టాండ్లలోని ఖాళీ స్థలాల కోసం టెండర్ ఏవిధంగా కోట్ చేయాలనే అంశమై ఔత్సాహిక వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్‌ఎస్ శర్మ, ఆర్టీసీ డీఈ బమ్మిడి రవికుమార్‌లు మాట్లాడుతూ ఇచ్ఛాపురంలో ఒకటి, టెక్కలిలో రెండు, ఆమదాలవలసలో రెండు, ఎచ్చెర్లలో ఒకటి చొప్పున ఖాళీ స్థలాలను 15ఏళ్ల లీజుకు ఇచ్చేందుకు టెండర్లను ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒకటో డిపో సీఐ వి.రమేష్, ఎస్‌ఎం ఎంపీ రావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డీఎస్సీ పరీక్షలు

ఎచ్చెర్ల: ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు మంగళవారం కొనసాగాయి. శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం షిఫ్టులో 144 మందికి 130 మంది, రెండో షిఫ్టులో 100 మందికి 96 మంది హాజరయ్యారు. రెండు షిఫ్టుల్లో 18 మంది గైర్హాజరయ్యారు.

ఘనంగా పండిత సత్కారాలు


వేద పండితులకు సత్కారాలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా మంగళవారం పండిత సత్కారాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో స్వామికి మంగళాశాసనాలు, పండితుల వేద పఠనం, చతుర్వేద పారాయణం జరిగింది. అనంతరం వేద పండితులు ఆరవెల్లి హరగోపాల శర్మ పర్యవేక్షణలో వేమూరి ప్రభాకరశర్మ, తెన్నేటి వెంకన్నశర్మ, దర్భముళ్ల ఆదిత్య శర్మ, పెంటా శ్రీనివాసశర్మ, తుమరాడ సందీప్ శర్మ, ధర్మపురి కృష్ణమూర్తి శర్మ, పెంట కిరణ్‌కుమార్ శర్మ, పెంట రాజగోపాల్ శర్మ, ఈధరపు ప్రశాంత్‌శర్మలకు పండిత సత్కారం, మహదాశీర్వచనం నిర్వహించారు. 11న నాగావళి నదిలో స్వామివారికి త్రిశూల స్నాన మహోత్సవం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గన్నవరపు కృష్ణారావు, రాజేశ్వరమ్మ దంపతులు, ఆలయ ఈఓ మునగవలస సుకన్య, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీచక్ర

సిరిజ్యోతి పూజలు


పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో ఉన్న బాలాత్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రరూపేన సిరిజ్యోతి పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రంపై దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.